జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 17 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 8

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో అర్హులైన ప్రతి కుటుంబాన్ని నమోదు చేయాలి

›» జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 16,(ప్రజాజ్యోతి) తెలంగాణ రాష్ట్రం లోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో అర్హులైన ప్రతి కుటుంబాన్ని నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులు,ఎంపీడీవోలు, ఎంపీ ఓలు, ఏపిఏం, ఎపి ఏం ల తో పథకం అమలుకు చేపట్టాల్సిన చర్యలు, నమోదు శిబిరాల నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జెడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ

మిగతా 2 లో...



జాతీయ వేదికపై భద్రాద్రి జర్నలిస్టుకు అరుదైన గౌరవం!

- ఒడిశా గవర్నర్ చేతుల మీదుగా మాలోత్ అశోక్‌కు పురస్కారం..
- తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు

కొత్తగూడెం, నవంబర్ 16, ప్రజాజ్యోతి: జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఉత్కల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజా జ్యోతి ప్రతినిధి మాలోత్ అశోక్‌కు అరుదైన గౌరవం లభించింది. ఒడిశా రాష్ట్ర గవర్నర్ శ్రీ బ్రజ్ మోహన్ రామ్ చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారం అందుకోవడం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు, తెలంగాణ పాత్రికేయ రంగానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది. ప్రజా జ్యోతి దినపత్రికలో జిల్లా ప్రతినిధిగా మాలోత్ అశోక్ గత కొంతకాలంగా ప్రజా సమస్యలు, సింగరేణి సంస్థ ఆర్థిక పరిస్థితి, కార్మికుల సమస్యలు, కొత్తగూడెం కార్పొరేషన్‌కు సంబంధించిన రూ.600కోట్ల అభివృద్ధి ప్రణాళిక, భూ వివాదాలు, రాజకీయ పరిణామాలపై అందించిన పరిశోధనాత్మక,విశ్లేషణాత్మక కథనాలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందించారు. ముఖ్యంగా సింగరేణి సంస్థ పెరుగుతున్న అప్పులు, లాభాల పంపిణీ, కార్మికుల బోనస్, సంస్థ భవిష్యత్తు, యాజమాన్య నిర్ణయాలపై గణాంకాలతో కూడిన కథనాలు అందించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికోసం ప్రతిపాదించిన రూ.600 కోట్ల ప్రణాళికలో నిధుల సమీకరణ, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల వాటా, విదేశీ రుణాల ప్రతిపాదనలు, వడ్డీ భారం, ప్రజాధనం వినియోగం వంటి అంశాలను పరిశీలిస్తూ వరుస కథనాలు ప్రచురించారు. జిల్లాలోని

మిగతా 2 లో...

ప్రజాజ్యోతి కథనాలు నిజమయ్యాయి..

తృటిలో తప్పిన ప్రమాదం!



- డివైడర్‌ను ఢీకొని పైకి ఎక్కిన బొలెరో వాహనం
- హెచ్చరిక బోర్డులు లేవు.. లైటింగ్ లేదు.. ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యమే కారణమా?
- ప్రాణాలు పోయాక స్పందిస్తారా?

అశ్వాపురం, నవంబర్ 16 , ప్రజాజ్యోతి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రం సమీపంలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. రహదారిపై అదుపుతప్పిన బొలెరో వాహనం డివైడర్‌ను ఢీకొని పైకి ఎక్కడంతో స్థానికంగా కలకలం రేగింది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అశ్వాపురం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై డివైడర్లు ఉన్నప్పటికీ కనీసం లైటింగ్ ఏర్పాటు చేయకపోవడం, రాత్రి వేళల్లో డివైడర్లు స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లు,

మిగతా 2 లో...

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలి

- క్రీడాకారులకు ఖేలో ఇండియా సర్టిఫికెట్లతో భవిష్యత్తులో మంచి గుర్తింపు
- జిల్లా అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్



కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 16,(ప్రజాజ్యోతి) తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ సూచనల మేరకు సోమవారం ఐ డి ఓ సి కార్యాలయాలో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లోగో, మస్కట్ పోస్టర్లను జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా యువజన , క్రీడల అధికారి బి. అనూష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ, ఈ నెల 15వ తేదీన కేంద్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ఢిల్లీలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్

మిగతా 2 లో...

పేదలకు అండగా అభివృద్ధిలో ముందుగా

ప్రజా ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారం

- పాయం వెంకటేశ్వర్లు



గుండాల నవంబర్ 16 ప్రజాజ్యోతి ప్రజా ప్రభుత్వంలో ప్రజల సమస్యలు పరిష్కరిస్తూనే అభివృద్ధిలో ముందడుగు వేస్తూ వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం గుండాల మండలంలో ఆయన పర్యటించారు. గుండాల మండలం సాయన్నపల్లి పంచాయతీలో సిసి రోడ్లను ప్రారంభించారు. 30 కోట్ల రూపాయలతో నిర్మించనున్న 33/11 సబ్ స్టేషన్ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు ప్రజలకు నాణ్యమైన విద్యుత్తును అందించడంలో భాగంగానే ఈ సబ్ స్టేషన్ ను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గి వ్యవసాయ రంగానికి ఎంతగానో ఉపయోగపడేలా ఈ సబ్ స్టేషన్లు ఉపయోగపడాలని ఆయన కోరారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో కొత్త పింఛన్లకు పత్రాలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అందులో భాగంగానే

మిగతా 2 లో...

జాతీయ వేదికపై భద్రాద్రి జర్నలిస్టుకు అరుదైన గౌరవం!

(మొదటి పేజీ తరువాయి...)

రాజకీయ పార్టీల పరిణామాలు, అంతర్గత విభేదాలు, నాయకుల వ్యూహాలు, ఎన్నికల సమీకరణాలు, ప్రజాప్రతినిధుల పనితీరుపై విశ్లేషణాత్మక కథనాలు అందించారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల భూ వివాదం, రైతుల సమస్యలు, గిరిజనుల హక్కులు, రిజర్వేషన్లు, జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల ఆందోళనలు, ప్రజా పంపిణీ వ్యవస్థలో సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు వంటి అనేక అంశాలను ప్రజల దృష్టికి తీసుకొచ్చారు. గత 19 సంవత్సరాలుగా ప్రజా జ్యోతి దినపత్రిక ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ కొనసాగిస్తున్న ప్రస్థానంలో భాగంగా జిల్లా ప్రతినిధిగా మాలోత్ అశోక్ అందించిన కథనాలకు జాతీయ స్థాయి వేదికపై గుర్తింపు లభించడం విశేషం. వార్తలను ప్రచురించడమే కాకుండా, వాటి వెనుక ఉన్న వాస్తవాలను పరిశీలించడం, ఆధారాలను సేకరించడం, బాధితుల వాణిని వినిపించడం, సంబంధిత అధికారుల వివరణలను ప్రజల ముందుంచడం వంటి బాధ్యతాయుతమైన పాత్రికేయ విధానాన్ని ఆయన అనుసరిస్తున్నారు. ఈ సందర్భంగా తన కథనాలను గుర్తించి జాతీయ స్థాయి వేదికపై గౌరవించిన ఉత్కల్ ప్రెస్ క్లబ్ నిర్వాహకులకు మాలోత్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారాన్ని తన వ్యక్తిగత విజయంగా కాకుండా ప్రజా జ్యోతి సంస్థ, ముఖ్య సంపాదకులు, సహచర పాత్రికేయులు, తన కథనాలకు సహకరించిన ప్రజలకు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రజలపక్షాన,ప్రజా ప్రయోజనాలకోసం తనకలం ప్రయాణం మరింత బాధ్యతతో కొనసాగుతుందని తెలిపారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలి



(మొదటి పేజీ తరువాయి...)

లోగో, మస్కట్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటడంతో పాటు కొత్త గూడెం జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారులకు లభించే సర్టిఫికెట్లకు భవిష్యత్తులో మంచి ప్రాధాన్యత ఉంటుందని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌పై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో విద్యార్థులకు ఈ క్రీడా పోటీల ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. ప్రధాన కూడళ్లు, బస్టాండ్ ఆవరణలు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా ద్వారా కూడా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పేదలకు అండగా అభివృద్ధిలో ముందుగా ప్రజా ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి...)

కొత్త పింఛన్లను మంజూరు చేయడం జరిగిందని, పేదలకు సన్న బియ్యం అందజేయడం కోసం కొత్త రేషన్ కార్డులను ఇప్పటికే మంజూరు చేయడం జరిగిందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి మార్గాలను సుఖమో చేస్తుందని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలు అడిగిందే తడువుగా ఇందిరమ్మ పిల్లను అర్హులకు ఇచ్చి పూర్తయ్యేలా ప్రణాళికలు చేసి గృహప్రవేశాలు చేస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇల్లు లేని నిరుపేదలు ఉండకూడదన్న ఆలోచనతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేసి పూర్తి చేసేందుకు కృషి చేస్తుందన్నార ఈ కార్యక్రమంలో విద్యుత్ శ శాఖ ఎస్ ఈ జి మహేందర్, డి ఈ రంగ స్వామి, ఏడిఈ రామారావు, ఎంపీడీవో బాలరాజు, తాసిల్దార్ బత్తిని సంగీత, సీఐ తిరుపతి , మండలంలో వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు, మండలాధికారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముత్తయ్య, ఎస్కే ఖదీర్, మండల నాయకులు బుచ్చయ్య, బికోజి, తదితరులు పాల్గొన్నారు

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో అర్హులైన ప్రతి కుటుంబాన్ని నమోదు చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

అధికారి అనూషతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబానికి ప్రధాన జీవనాధారంగా ఉన్న సంపాదనపరుడు అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆకుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా 5 లక్షల జీవిత బీమా పరిహారం అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పథక మార్గదర్శకాల ప్రకారం అర్హులైన కుటుంబాలు నమోదు చేసుకోవచ్చని, కులం, ఆదాయం, ఏపీఎల్, బీపీఎల్ వంటి అంశాలతో సంబంధం లేకుండా అర్హతలను పరిశీలించి లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. బీమా పొందే వ్యక్తి వయస్సు 18 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలని, ఇందుకోసం 19-11-1967 నుంచి 18-11-2008 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. కుటుంబ సభ్యులు తమలో ఎవరి పేరు మీద బీమా చేయించుకోవాలనేది నిర్ణయించుకోవచ్చని, నామినీగా ఒకరి కంటే ఎక్కువ మందిని ఎంపిక చేసుకొని భార్య, కుమారుడు, కుమార్తె తదితరులకు నిర్దిష్ట శాతాల్లో బీమా పరిహారం కేటాయించే అవకాశం ఉందని వివరించారు.భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక శిబిరాల ద్వారా నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని, డిసెంబర్ 19 వరకు నెల రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు స్థాయిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి శిబిరానికి ఒక బాధ్యతాయుత మైన అధికారిని, ప్రతి నాలుగు గ్రామ పంచాయతీలు లేదా నాలుగు వార్డులకు ఒక సూపర్వైజరీ అధికారిని నియమించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో లేని చోట ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలకు సూచించారు.శిబిరాల్లో కంప్యూటర్, ప్రింటర్, ఇంటర్నెట్, టెంట్, కుర్చీలు, తాగునీరు, మైక్ వంటి సదుపాయాలతో పాటు ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లతో పాటు దరఖాస్తుదారులకు మార్గనిర్దేశం చేసే సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీ మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని అన్నారు . రేషన్ కార్డుల ఆధారంగా అందుబాటులో ఉండే ప్రీ-ఫిల్డ్ డేటాను ఉపయోగించుకొని దరఖాస్తులు నింపాలని, రేషన్ కార్డు లేని కుటుంబాల వివరాలను ప్రత్యేక ఖాళీ దరఖాస్తుల ద్వారా సేకరించాలని సూచించారు.





బీమాదారుడి ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, నామినీల వివరాలను పరిశీలించి నమోదు చేయాలని, నామినీ మైనర్ అయితే సంరక్షకుడి వివరాలను కూడా పొందుపరచాలని తెలిపారు. దరఖాస్తులో నమోదైన వివరాలను బీమాదారుడికి వివరించిన తర్వాత తప్పనిసరిగా ఆయన సంతకం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ-డీఎం సైదేశ్వర రావు సమావేశంలో ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా చేసి చూపించారు..

నమోదు కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు నవంబర్ 17, 18 తేదీల్లో మైక్ ప్రచారం, వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా, పత్రికా ప్రకటనల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని విద్యా చందన సూచించారు. గ్రామ సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి సమాచారం చేరేలా చర్యలు చేపట్టాలని తెలిపారు, ప్రభుత్వం కల్పిస్తున్న 5 లక్షల రూపాయల జీవిత బీమా భద్రతను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని, నవంబర్ 19 నుంచి నిర్వహించే ప్రత్యేక నమోదు శిబిరాలకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలతో హాజరై తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ కోరారు.

ప్రజాజ్యోతి కథనాలు నిజమయ్యాయి

(మొదటి పేజీ తరువాయి...)

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డివైడర్లు ఉన్నాయనే విషయం కూడా దూరం నుంచి తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనాలు డివైడర్లను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ సమస్యపై గతంలోనే ప్రజాజ్యోతి పత్రిక పలు కథనాల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. అయినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ముందుగానే హెచ్చరించినా స్పందించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం డివైడర్లకు రేడియం స్టిక్కర్లు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు తగిన లైటింగ్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ఆర్ అండ్ బి అధికారులపై ఉంది. ప్రజాజ్యోతి పత్రిక ముందుగానే హెచ్చరించినా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాలు పోయాక స్పందిస్తారా?

ఒకవేళ ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరిగి ఉంటే బాధిత కుటుంబాల పరిస్థితి ఏమిటి? వారి పిల్లల భవిష్యత్తుకు ఎవరు బాధ్యత వహిస్తారు? ప్రమాదం జరిగే వరకు వేచి చూసి, ఆ తర్వాత స్పందించడం అధికారులకు పరిపాటిగా మారిందా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి డివైడర్లకు రేడియం స్టిక్కర్లు, హెచ్చరిక బోర్డులు, లైటింగ్ ఏర్పాటు చేసి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ప్రజాజ్యోతి ముందే హెచ్చరించింది.. ప్రమాదం కళ్లముందు జరిగింది.. ఇకనైనా అధికారులు మేల్కొంటారా?

కార్తీక మొదటి సోమవారం.. శివనామస్మరణతో మార్మోగిన మల్లికార్జున స్వామి ఆలయం





- **ఉదయం నుంచి స్వామి వారికి విశేష అభిషేకాలు.. భక్తులకు అన్నదానం**

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 16, (ప్రజాజ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాసం మొదటి సోమవారం పురస్కరించుకొని ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి శివనామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి స్వామివారికి విశేష అభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం చాపరాలపల్లి గ్రామానికి చెందిన నరసింహారావు, నీరజ దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు మహాప్రసాదాన్ని అందజేశారు. కార్తీక సోమవారం కావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా కార్యనిర్వహణాధికారి ప్రత్యేక పర్యవేక్షణలో అన్ని వసతులు కల్పించారు. భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకునేలా ఆలయ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ పీవీ రమణ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు బాలల హక్కులు, అభి ప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- "నా రోజు.. నా హక్కులు.. నా భవి ష్యత్' నినాదంతో పిల్లల ప్రజావాణి లో 73 దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్





కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 16,(ప్రజా జ్యోతి)

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని, ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే ప్రతి దరఖాస్తును పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ ఆదేశించారు.సోమవారం ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,డీపీఓ అనూషాతో కలిసిప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు, ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును పరిశీలించి, వాటిని తక్షణమే పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులు ఆదేశించారు, ప్రజావాణిలో భాగంగా తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూనిసెఫ్ భాగస్వామ్యంతో 'నా రోజు.. నా హక్కులు.. నా భవిష్యత్' అనే నినాదంతో పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ సమస్యలు, అవసరాలు, అభిప్రాయాలను అదనపు కలెక్టర్లకు విన్నవిస్తూ దరఖాస్తులు సమర్పించారు. పిల్లల ప్రజావాణిలో మొత్తం 73 దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ పిల్లల ప్రజావాణి ద్వారా బాలల అవసరాలు,సమస్యలు,అభిప్రాయాలు,ఆశయాలు, ఆకాంక్షలను తెలుసుకొని వారి భవిష్యత్తుకు భరోసా కల్పించే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. బాలల అభిప్రాయాలకు ప్రాధాన్యత నిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన మాట్లాడుతూ పిల్లల సమస్యలను వారి కోణంలో అర్థం చేసుకొని,వారికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా బాలల స్నేహపూర్వక పాలన సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి బాలుడు, బాలికకు విద్య, ఆరోగ్యం, రక్షణ, సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం కృషి చేయాలని సూచించారు.

›» ప్రజావాణిలో వచ్చిన కొన్ని దరఖాస్తులు

కొత్తగూడెం బాబు క్యాంపుకు చెందిన స్పందన అనే ఒంటరి మహిళ తన కుమారుడు బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని, మొదటి సంవత్సరం నుంచి రావాల్సిన స్కాలర్‌షిప్ ఇప్పటివరకు జమ కాలేదని తెలిపారు. స్కాలర్‌షిప్‌పై ఆధారపడి చదువుకుంటున్న తన కుమారుడికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ వినతిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.ములకలపల్లి మండలం చండ్రుకుంట రాజాపురం గ్రామానికి చెందిన 34 మంది రైతులు 2000 సంవత్సరం నుంచి పోడుభూములను సాగు చేసుకుంటున్నామని, వారిలో కొంతమందికి మాత్రమే ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరయ్యాయని, మిగిలిన రైతులకు కూడా పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ వినతిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు. బూర్గంపాడు మండలం పినపాక గ్రామానికి చెందిన భానోత్ వెంకటేశ్వర్లు గతంలో నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో ఎయిడ్స్, లెప్రసీ మొబైల్ హెల్త్ బృందంలో కౌన్సిలర్‌గా పనిచేశానని, ప్రస్తుతం ఎలాంటి ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తెలిపారు. తనకు సోషల్ వర్కర్‌గా ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ వినతిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.

›» పిల్లల ప్రజావాణిలో వచ్చిన కొన్ని దరఖాస్తులు

లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుల చీలక గ్రామానికి చెందిన వెకో గణేష్ తాము ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి 30 సంవత్సరాల క్రితం వలస వచ్చి ఇక్కడే నివాసం ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. తన ఇద్దరు పిల్లలు అమీర్, మున్నాలకు ఆధార్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు జారీ కాలేదని, ఆధార్ కార్డులు లేక పిల్లల చదువుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఆధార్ కార్డులు మంజూరు చేయించి వారి విద్యాభ్యాసానికి సహకరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.మణుగూరు మండలం ధమ్మక్కపేట గ్రామానికి చెందిన బట్ట జోష్ణ తన తండ్రి అనారోగ్యంతో మరణించారని, తన చదువుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు మిషన్ వాత్సల్య పథకం కింద స్పాన్సర్‌షిప్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. అశ్వాపురం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన 12 ఏళ్ల కనితి శ్రీవల్లి తాను ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నానని,తన తండ్రి మరణించడంతో చదువు కొనసాగించేందుకు ఆర్థిక సహాయం అవసరమని తెలిపారు. మిషన్ వాత్సల్య పథకం కింద స్పాన్సర్‌షిప్ మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ బాలల దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, అర్హతల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్లు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, జిల్లా సంక్షేమ అధికారి కె.ఎం. తార, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఎం.డి. సాధిక్ పాషా, ఎస్. సుమిత్రాదేవి, కె. అంబేద్కర్, బాలల సంరక్షణ అధికారి ఎం. హరికుమారి, నేషనల్ న్యూట్రిషన్ రూప, డీసీపీయూ సిబ్బంది ఆదే శేషయ్య, అబ్దుల్ అజీజ్, నాగరాజు, వినోద్ కుమార్, టి. బాబు, టి. భారతి, కళ్యాణి, లత, రాజు, చైల్డ్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ సందీప్ కుమార్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు అండగా ప్రజా ప్రభుత్వం: 61 మందికి చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ



పినపాక,నవంబర్ 16(ప్రజాజ్యోతి)మండలంలోని జానంపేట గ్రామంలో సోమవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పూనెం ఉమామహేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు కలిపి మొత్తం 61 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.

›» పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: సర్పంచ్ ఉమామహేశ్వరి

ఈ సందర్భంగా సర్పంచ్ పూనెం ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలతో ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

›» పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం: ఉప సర్పంచ్ దాట్ల రాజేష్

ఉపసర్పంచ్ దాట్ల రాజేష్‌మాట్లాడుతూ..గత ప్రభుత్వాల హయాంలో సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హులైన లబ్ధిదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని అన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తోందని, ప్రతి పేద కుటుంబంలో ఆనందం నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

›» లబ్ధిదారుల హర్షం



నూతనంగా పింఛన్ మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.తమకు ఆర్థిక భరోసా కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి,స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు,గ్రామ పంచాయతీ పాలకవర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి రహీమ్, వార్డు సభ్యులు మడికాంత, వాసం కుమార్, కామిశెట్టి హిమబిందు, జర్పుల శ్రీవిద్య, పాటిబండ్ల సత్యనారాయణ, పొనుగోటి చందర్ రావు, జబ్బ శారద, కబ్బాకు రమేష్, పొలిశెట్టి హరీష్, కందుల పద్మ, ఏనిక సుజాత తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో కేటీపీఎస్ ఎనిమిదో దశను నెలకొల్పాలని మంత్రి తుమ్మలను కలిసిన పాల్వంచ సాధన సమితి నాయకులు



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 16,(ప్రజాజ్యోతి) పాల్వంచ పట్టణంలో 800 మెగావాట్ల విద్యుత్ కర్మాగారాన్ని నెలకొల్పాలని కోరుతూ పాల్వంచ కేటీపీఎస్ 800 మెగావాట్ల సాధన సమితి నాయకులు, పాల్వంచలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు , విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, పలువురు కార్పొరేటర్లు సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును దమ్మపేట లోని ఆయన స్వగృహం లో కలిసి విన్నవించారు, ఇందుకు స్పందించిన మంత్రి తుమ్మల పాల్వంచలో అన్ని వర్గాల ప్రజలకు అత్యంత అవసరమైన కేటీపీఎస్ 8వ దశ కర్మాగారాన్ని నెలకొల్పేందుకు నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు, మంత్రి తుమ్మలను కలిసిన వారిలో సాధన సమితి నాయకులు , వివిధ పార్టీల రాజకీయ నాయకులు, పలువురు కార్పొరేటర్లు ,కే టి పీఎస్ యూనియన్ సంఘాల నాయకుడు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలి

- గిరిజనుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి
- భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్



భద్రాచలం, నవంబర్ 16 (ప్రజాజ్యోతి): మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు సమర్పించే సమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజ్ సూచించారు.సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన ఎస్‌డీసీ ఆనంద్ కుమార్, ఆర్‌సీఓ అరుణకుమారి, ఏడీఎంహెచ్‌ఓ సైదులు, ఈఈ మధుకర్‌లతో కలిసి గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా పోడు భూముల పట్టాలు, గిరి వికాసం పథకం కింద విద్యుత్, బోర్లు, మోటార్లు, స్వయం ఉపాధికి ఆర్థిక సహాయం, భూ సమస్యల పరిష్కారం, గ్రామాలకు రహదారులు, విద్యుత్ సౌకర్యం, నూతన మత్స్య సహకార సంఘాల ఏర్పాటుకు గిరిజనులు దరఖాస్తులు సమర్పించారు.

జిపి కార్మికురాలు సామ్రాజ్యం కుటుంబాన్ని ఆదుకోవాలని డిపిఓ కి సి ఐ టి యు. వినతి



కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 16,(ప్రజా జ్యోతి) విధుల్లో ఉన్న భద్రాచలం గ్రామ పంచాయతి కార్మికురాలు గాయపడి ఎడమ చేయి తొలగించిన కారణంగా ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డీపీవో అనూష కి సిఐటీయు ప్రతినిధి బృందం సోమవారం వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎజె రమేష్ మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన విధుల్లో ఉండగా వ్యాన్ ఢీ కొట్టిన కారణంగా ఎడమ చేయి నుజ్జు లుజ్జయిందని,దీనితో భద్రాచలం ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు తక్షణమే వైద్యం అందించి ఆమే చేతిని తొలగించడం జరిగిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం పోస్టల్ ఇన్సూరెన్స్ కట్టించినప్పటికీ దానిని రెన్యువల్ చేయని కారణంగా తీవ్రంగా గాయపడి ఎడమ చేయి కోల్పోయిన కార్మికురాలికి నయా పైసా కూడా నష్టపరిహారం వచ్చే అవకాశం లేనందున తక్షణమే గ్రామపంచాయతీ బాధ్యత తీసుకొని 10 లక్షల రూపాయలు నష్టపరిహారం అందించాలని కోరుతూ జిల్లా పంచాయతీ అధికారి అనూష కి విజ్ఞప్తి చేశారు.మొత్తం కార్మికులందరికి తక్షణమే పోస్టల్ ఇన్సూరెన్స్ చేయించాలని, కార్మికులకు మూడు సంవత్సరాలుగా యూనిఫామ్ ఇవ్వలేదని చెప్పులు,కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వాలని, ఆదాయం ఉన్న పంచాయతీగా ఉన్నందున కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు.కార్మికులందరికీ పీయఫ్,ఈ.యస్.ఐసౌకర్యం కల్పించాలని,ఆదివారం,పండగ సెలవులు అమలు చేయాలని కోరగా ఇందుకు స్పందించిన డిపిఓ అనూష మాట్లాడుతూ భద్రాచలంలో జరిగిన ఘటన తన నోటీస్ కి రాలేదని వెంటనే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు కార్మికుల వేతనాలు పెంచాలని సిఫారసు వస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు,డిపిఒ నికలిసిన వారిలో సిఐటి జిల్లా కార్యదర్శి ఎ.జె.రమేష్ తో పాటం ఉపాధ్యక్షులు దొడ్డా రవికుమార్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాలపై అధికారుల అజమాయిషీ ఏదీ?

- మీసేవ కేంద్రాల్లో ఇష్టారాజ్యమా?
- మంజూరు మిట్టగూడెంలో.. నిర్వహణ అశ్వాపురంలో!
- ప్రభుత్వ ధరలకు పాతర.. ప్రజలపై అదనపు భారం!
- నిబంధనలు గాలికి.. అధికారులు ఏం చేస్తున్నట్లు?
- అక్రమ వసూళ్లపై విచారణ చేపట్టాలి: వెన్న అశోక్



అశ్వాపురం, నవంబర్ 16, ప్రజాజ్యోతి: అశ్వాపురం మండలంలో మీసేవ కేంద్రాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మిట్టగూడెంలో మంజూరైన మీసేవ కేంద్రం అశ్వాపురంలో ఎందుకు కొనసాగుతోందని టీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకుడు వెన్న అశోక్ ప్రశ్నించారు. మంజూరైన ప్రాంతాల్లో కాకుండా మండల కేంద్రంలోనే మీసేవలు కొనసాగిస్తే మారుమూల గ్రామాల ప్రజలకు సేవలు ఎలా అందుతాయని నిలదీశారు. చిన్నచిన్న ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు ప్రభుత్వనిర్ణీత ధరలకు మించి రుసుములు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రతి కేంద్రంలో ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, మంజూరు వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా అధికారులు నిద్ర వీడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించే మీసేవ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని వెన్న అశోక్ కోరారు.

రాజకీయాలకు ముందే ప్రజాసేవలో అడుగులు..!

- ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ భరోసా..
- పోలిశెట్టి సత్తిబాబు ప్రత్యేక ప్రస్థానం!
- చిన్నతనం నుంచే సేవా గుణం
- 2009లో రాజకీయ ప్రస్థానం ప్రారంభం
- పదవులు, రాజకీయాలకు అతీతంగా ప్రజల కష్టాల్లో భాగస్వామ్యం
- ఊపిరి ఉన్నంతవరకు ప్రజాసేవే తన లక్ష్యమంటున్న సత్తిబాబు!









పినపాక,నవంబర్ 16(ప్రజాజ్యోతి): సమాజంలో గుర్తింపు రావాలంటే పదవులు, రాజకీయ హోదాలు అవసరం లేదు..మనిషికి మంచి మనసు,ఎదుటి వారి కష్టాన్ని తన కష్టంగా భావించే గుణం ఉంటే చాలు. ప్రజల ఆపదలో అండగా నిలుస్తూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు తనకు చేతనైన సహాయం చేస్తూ ప్రజల మధ్య ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న వ్యక్తి పోలిశెట్టి సత్తిబాబు.

›» రాజకీయాలకు ముందే మొదలైన ప్రజాసేవ

పినపాక మండలం ఎల్బిరెడ్డిపల్లి గ్రామపంచాయతీకి చెందిన పోలిశెట్టి సత్తిబాబు ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. చిన్నతనం నుంచే సమాజం పట్ల ప్రత్యేక ఆలోచన కలిగి ఉండేవారు. తనకు అవగాహన వచ్చినప్పటి నుంచే ఎదుటివారికి సహాయం చేయాలనే తపన ఆయనలో ఉండేది. రాజకీయాల గురించి ఆలోచన రాకముందే, రాజకీయ ప్రస్థానం ప్రారంభం కాకముందే ఆపదలో ఉన్న వారికి తన వంతు సాయం చేస్తూ ప్రజాసేవకు శ్రీకారం చుట్టారు. తన దగ్గర ఉన్న కొద్దిపాటి సొమ్ములోనూ పది మందికి సహాయం చేయాలనే మనస్త్వంతో ముందుకు సాగారు.

›» 2009లో రాజకీయ ప్రస్థానం.. సేవే పునాది!

చిన్ననాటి నుంచే కొనసాగిస్తున్న సేవా కార్యక్రమాలకు రాజకీయ ప్రస్థానం మరో వేదికగా మారింది. 2009లో రాజకీయాల్లోకి అడుగుపెట్టినప్పటికీ ఆయనకు ప్రజాసేవ కొత్త కాదు. రాజకీయాలకు ముందు ఎలా ప్రజలకు అండగా నిలిచారో, రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన తర్వాత కూడా అదే సేవా భావంతో కొనసాగుతున్నారు. పదవులు, హోదాలతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల్లో భాగస్వాములవుతున్నారు.

›» ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు అండగా

మండలంలో ఎవరైనా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని తెలిసినా,కుటుంబంలో పెద్దను కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిసినా తన వంతు సహాయం అందించేందుకు ముందుంటారు. దినకర్మలు, ఇతర కుటుంబ కార్యక్రమాల్లో అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తూ బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

›» అనారోగ్యం.. ప్రమాదం..

ఏ ఆపద వచ్చినా నేనున్నానంటూ భరోసా!

ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతున్నా, ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చేరినా వారి కుటుంబాలకు ధైర్యం చెప్పడంతో పాటు అవసరమైన సహాయం అందిస్తున్నారు. అవసరమైతే బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్లి,వైద్య చికిత్స సమయంలోనూ దగ్గరుండి పరామర్శిస్తున్నారు. కేవలం మాటలతో పరామర్శించడం కాకుండా చేతల్లో సహాయం చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నారు.

›» ప్రజల కష్టమే తన కష్టంగా భావించే మనస్తత్వం..

ఒకరి కష్టాన్ని చూసి స్పందించడం, అవసరమైన సమయంలో అండగా నిలవడం,ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రోత్సాహం అందించడం వంటి సేవా కార్యక్రమాలే సత్తిబాబు ప్రస్థానంలో ప్రధాన భాగంగా నిలుస్తున్నాయి. ఎప్పుడు, ఎవరికి అవసరం వచ్చినా తనకు చేతనైనంత సహాయం చేయాలనే సంకల్పంతో ప్రజల మధ్య కొనసాగుతున్నారు.

›» ఊపిరి ఉన్నంతవరకు ప్రజాసేవే లక్ష్యం!

రాజకీయాలు తనకు ఒక వేదిక మాత్రమేనని, ప్రజాసేవ అనేది తన జీవితంలో భాగమని చెప్పే సత్తిబాబు.. తనకు ఊపిరి ఉన్నంతవరకు ప్రజల మధ్యే ఉంటూ, ఆపదలో ఉన్నవారికి తనవంతు సహాయం అందిస్తానని చెబుతున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ప్రజాసేవ ప్రారంభించిన వ్యక్తి కాదు..ప్రజాసేవ చేస్తూనే రాజకీయ ప్రస్థానంలోకి అడుగుపెట్టిన వ్యక్తిగా పోలిశెట్టి సత్తిబాబు ప్రయాణం కొనసాగుతోంది.



టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో ఘనంగా "జర్నలిస్టు డే" వేడుకలు

- జాతీయ కౌన్సిల్ సభ్యులు బి. వి. రమణా రెడ్డికి సన్మానం
- జర్నలిస్టు అన్వేష్ రెడ్డికి రూ.5 వేలు ఆర్థిక సాయం
- పట్టణ అధ్యక్షులు విజ్జగిరి రాజా కిరణ్

భద్రాచలం, నవంబర్ 16 (ప్రజా జ్యోతి): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) పట్టణ కమిటీ అధ్యక్షులు విజ్జగిరి రాజా కిరణ్ ఆధ్వర్యంలో సోమవారం జర్నలిస్టు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ కౌన్సిల్ సభ్యులు బీవీ రమణా రెడ్డి కి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.సభ్యుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం తూరికేపల్లి భరత్ చంద్ర, పట్టణ అధ్యక్షులు విజ్జగిరి రాజా సహకారంతో...ఆర్.టి.వి,రిపోర్టర్,యూనియన్ సభ్యులు అన్వేష్ రెడ్డి కి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ ఎప్పుడు ముందుంటుందని యూనియన్ నాయకులు తెలిపారు.





ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, చారుగుల్లా రమేష్, సోమరౌత్ శ్రీనివాస్, దిలీప్, పివి బాబు, డివిజన్ ఉపాధ్యక్షులు కాటా సత్యం, పట్టణ కోశాధికారి బోనాల లక్ష్మీనరసింహారావు (నాయుడు), జిల్లా కార్యవర్గ సభ్యులు మధార్, ఎడమకంటి దుర్గారెడ్డి, ఆవుల సత్యనారాయణ, రామకృష్ణ, బి. వెంకట్, ,శ్రీ శ్రీ, రేపాక అఖిల్, వెంకట్, కొప్పుల మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఊట్లపల్లి గ్రామపంచాయతీలో ముదురుతున్న నిధుల వివాదం!

- సర్పంచ్, ఉప సర్పంచ్ మధ్య ఆరోపణలు.. ప్రత్యారోపణలు
- ప్రజావాణిలో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు.. నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణకు డిమాండ్
- ఉప సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయాలని అధికారులకు సర్పంచ్ లక్ష్మీకుమారి వినతి





అశ్వారావుపేట రూరల్ ప్రజా జ్యోతి నవంబర్ 16 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్, ఉప సర్పంచ్ మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతోంది. గ్రామ పంచాయతీ నిధుల వినియోగం, అభివృద్ధి పనుల నిర్వహణ అంశాలు ఇరువురి మధ్య విభేదాలకు కారణమవుతున్నాయి. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఆశ్రయించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.గతవారం సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఊట్లపల్లి గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ సాధు జోసెఫ్ కులకర్ణి సర్పంచ్ సత్యం లక్ష్మీకుమారిపై తీవ్ర ఆరోపణలు చేస్తూ మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని, తప్పుడు లెక్కలు చూపించి నిధులు డ్రా చేశారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామపంచాయతీకి సంబంధించిన నిధుల ఖర్చుల వివరాలను పరిశీలించి, నిధుల వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను కోరారు.ఈ ఫిర్యాదుపై చర్చ కొనసాగుతుండగానే తాజాగా ఈరోజు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సర్పంచ్ సత్యం లక్ష్మీకుమారి ఉప సర్పంచ్ సాధు జోసెఫ్ కులకర్ణి పై ఫిర్యాదు చేయడం మరో మలుపుగా మారింది. గ్రామపంచాయతీ అభివృద్ధి పనులకు ఉప సర్పంచ్ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆమె ఆరోపించారు. గ్రామ అభివృద్ధి సజావుగా సాగేందుకు ఆటంకాలు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.తనపై ఉప సర్పంచ్ చేసిన నిధుల దుర్వినియోగం ఆరోపణలపై మండల స్థాయి అధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని సర్పంచ్ లక్ష్మీకుమారి డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీకి వచ్చిన నిధులు ఎంత? ఏయే పనులకు ఎంత ఖర్చు చేశారు? నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయా? అనే అంశాలపై పంచాయతీ రికార్డులు, బిల్లులు, ఖర్చుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను గ్రామ ప్రజలకు తెలియజేయాలని తన ఫిర్యాదులో పేర్కొన్నారు.అంతేకాకుండా ఊట్లపల్లి ఉప సర్పంచ్ సాధు జోసెఫ్ కులకర్ణి కి ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేయాలని కూడా మండల అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు కలగకుండా, పాలనాపరమైన సమస్యలు పరిష్కారమయ్యేలా అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

›» ఒకే గ్రామపంచాయతీ..

రెండు ఫిర్యాదులు!

ఒకవైపు గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగం జరిగిందని ఉప సర్పంచ్ ఆరోపిస్తుండగా, మరోవైపు గ్రామాభివృద్ధికి ఉప సర్పంచ్ అడ్డుపడుతున్నారని సర్పంచ్ ఫిర్యాదు చేయడం ఊట్లపల్లి గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. గ్రామ ప్రజలకు అందాల్సిన అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులపై ఈ వివాదం ప్రభావం చూపుతుందా అనే ఆందోళన వ్యక్తమవుతోంది.

›» అధికారుల విచారణతోనే అసలు నిజాలు వెలుగులోకి!

ఇరువురు ప్రజాప్రతినిధులు చేసిన ఆరోపణల నేపథ్యంలో మండల పరిషత్, గ్రామపంచాయతీ సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. గ్రామ పంచాయతీ నిధుల డ్రాయింగ్ వివరాలు, చెక్కులు, ఖర్చుల బిల్లులు, తీర్మానాలు, అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్థులు కోరుతున్నారు.ప్రజల కోసం పనిచేయాల్సిన గ్రామపంచాయతీలో ప్రజాప్రతినిధుల మధ్య నెలకొన్న ఈ వివాదానికి అధికారులు ఎలాంటి పరిష్కారం చూపుతారు? నిధుల వినియోగంపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవాలేమిటి? ఉప సర్పంచ్ చెక్ పవర్ రద్దుపై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా

- ఆశావర్కర్లకు ఫిక్స్డ్ వేతనం 18000 ఇవ్వకుంటే డిసెంబర్ 15 నుండి సమ్మె చేస్తాం
- సి ఐ టి యు జిల్లా కార్యదర్శి ఏ జె రమేష్





కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 16 ,(ప్రజా జ్యోతి) ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఆశ వర్కర్లతో కలిసి స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు ,ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం 18000 ఇవ్వాలనీ డిమాండ్ చేశారు, 18 వేల ఫిక్స్డ్ వేతనం నిర్ణయం చేయకపోతే డిసెంబర్ 15 నుండి సమ్మెకు సిద్ధమవుతామని అన్నారు,ఆశా వర్కర్లు ప్రజారోగ్య పరిరక్షణలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ నిరంతరం సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరైంది కాదని విమర్శించారు.ప్రాణాలను పణంగా పెట్టి కరణ అరికట్టడంలో మొక్కే పాత్ర పోషించిన కరోనా వారియర్స్ అని పేరు దబల్యూ హెచ్ ఓ అంతర్జాతీయ సంస్థ ఆశ వర్కర్ల శ్రమను గుర్తించినప్పటికీ అంతటి గుర్తింపు పొందిన ఆశ వర్కర్లకు వేతనాలు పెంచకపోవడం ప్రమాద బీమా సౌకర్యం పిఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరం అన్నారుఐదు సంవత్సరాలు ప్రజాప్రతినిధులుగా ఉన్న ఎంపీలు ఎమ్మెల్యేలకు పెన్షన్ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం 20 సంవత్సరాలుగా పని వస్తున్నా ఆశ వర్కర్లకు ఎందుకు పెన్షన్స్ సౌకర్యం కల్పించారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు , 2023లో ఆశ వర్కర్లతో కమిషనర్ ప్రభుత్వం చర్చలు జరిపి ఆశ వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం మాధ బీమా 50 లక్షలు ఇస్తానని, మట్టి ఖర్చులు 50 వేలు ఇస్తానని చర్చలు జరిపి హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదు అని అన్నారు చర్చలు జరిపి ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్లే డిసెంబర్ 15 నుండి రాష్ట్రవ్యాప్త సమ్మెకు సిద్ధమవుతున్నారా అన్నారుఆశా వర్కర్లకు నెలకు రూ.18,000 ఫిక్స్డ్ వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.50 లక్షల ప్రమాద బీమా, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు, రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం ఇస్తున్న పారితోషకంలో సగం మొత్తాన్ని పెన్షన్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఆదివారాలు,పండుగ సెలవులు, 20 రోజుల క్యాజువల్ సెలవులు, వేతనంతో కూడిన ఆరు నెలల మెడికల్ సెలవులు అమలు చేయాలని, ఏఎన్ఎం, జీఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రమోషన్లు కల్పించాలని కోరారు.రెండో పీఆర్సీ ప్రకటించి ఆశా వర్కర్లకు రూ.30,000 కనీస వేతనం నిర్ణయించాలని,ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను ఆశా వర్కర్లకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.ఆశ వర్కర్ల న్యాయ మైన సమస్యలను పరిష్కరించకపోతేఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు, అనంతరం హలో డిమాండ్లతో కూడిన పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలోని అధికారులు అందజేశారు,ఆశా జిల్లా అధ్యక్షులు ర్యూన్సీ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కే. బ్రహ్మచారి, జిల్లా కోశాధికారి జి. పద్మ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి , దుబ్బా ధనలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు గద్దల శ్రీనివాస్, కే. సత్య, అబ్దుల్ నబీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సుశీల, జయ, చీమల రమణమాధవి హైమాసుజాత నర్సు సుగు యశోద మల్లేశ్వరి భారతి సునీత నీలిమ తదితరులు పాల్గొన్నారు

భద్రాచలం డయాలసిస్ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన

- ఏజెన్సీ ప్రాంత పేదలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు
- ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాచలం శాఖ మరో కీలక ముందడుగు



భద్రాచలం, నవంబర్ 16 (ప్రజా జ్యోతి): ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాచలం శాఖ మరో కీలక ముందడుగు వేసింది.రెడ్‌క్రాస్ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న డయాలసిస్ కేంద్రానికి ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు.భద్రాచలం పరిసర ప్రాంతాలతో పాటు మారుమూల గిరిజన గ్రామాల్లో కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న పేదలు డయాలసిస్ చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీని వల్ల ప్రయాణ ఖర్చులు,ఆర్థిక ఇబ్బందులతో పాటు రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలంలోనే డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి వస్తే పేద, గిరిజన కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. వైద్యుల పర్యవేక్షణలో సాధారణ రుసుముతో డయాలసిస్ సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.కిడ్నీలు పూర్తి స్థాయిలో పనిచేయని రోగులకు డయాలసిస్ ప్రాణాధారమైన చికిత్స కావడంతో వారానికి రెండు, మూడు సార్లు వైద్యుల సూచన మేరకు చికిత్స పొందాల్సి ఉంటుంది. ఈ సేవలు స్థానికంగా అందుబాటులోకి రావడం ఏజెన్సీ ప్రజలకు ఎంతో ఊరటనివ్వనుంది.భద్రాచలం రెడ్‌క్రాస్ శాఖ ఇప్పటికే రక్తనిధి కేంద్రం, తలసేమియా బాధిత చిన్నారులకు వైద్య సేవలు, ప్రత్యేక వార్డు, సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. తాజాగా డయాలసిస్ కేంద్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ద్వారా తన సేవలను మరింత విస్తరించనుంది.ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ జి.వి.వి. సుదర్శన్ రావు, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ భాను ప్రసాద్, రాజారెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మోహన్ రావు, కార్యదర్శి రమేష్ చంద్ర, డాక్టర్ గీతా పావని, పట్టణ ప్రముఖులు, రెడ్‌క్రాస్ శాఖ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ మహాయోధుల విగ్రహాల ఏర్పాటుకు సంపూర్ణ సహకారం

- మాజీ ఎమ్మెల్యే, టీజీఎస్ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ పొదెం వీరయ్య



భద్రాచలం, నవంబర్ 16 (ప్రజా జ్యోతి): భద్రాచలంలో ఏర్పాటు చేయనున్న భగవాన్ బిర్సా ముండా, కోయ బెబ్బులి సోయం గంగులు విగ్రహాల నిర్మాణ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే, టీజీఎస్ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ పొదెం వీరయ్యను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విగ్రహాల ఏర్పాటు, ప్రతిష్ఠాపనపై చర్చించారు.భద్రాచలం ఆదివాసీల ఆధ్యాత్మిక,సాంస్కృతిక కేంద్రంగా ఉందని,ఇక్కడ ఆదివాసీ మహాయోధుల విగ్రహాల ప్రతిష్ఠాపన గిరిజన సమాజానికి గర్వకారణమని పొదెం వీరయ్య అన్నారు. జల్, జంగల్, జమీన్ పరిరక్షణ కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించేందుకు ఈ విగ్రహాలు దోహదపడతాయని పేర్కొన్నారు. విగ్రహాల నిర్మాణ కమిటీ గౌరవ సలహాదారునిగా తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు కుంజా ధర్మారావు, గుండు శరత్, తెల్లం రమణయ్య, కుంజా సంతోష్,కాంగ్రెస్ నాయకులు వాసిరెడ్డి సాంబశివరావు,కాపుల శ్రీను, కొలపూడి వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే జారె

- మృతుల కుటుంబాలకు పరామర్శ.. అనారోగ్యంతో ఉన్నవారికి ఆత్మీయ భరోసా



దమ్మపేట,నవంబర్. 16,(ప్రజాజ్యోతి): అకాల మరణంతో విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కలిసి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుంటూ అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆత్మీయ భరోసా కల్పించారు.దమ్మపేట మండలం పట్వారిగూడెం గ్రామానికి చెందిన పఠాన్ వహీద్ ఖాన్ (మున్నా) గుండెపోటుతో అకాల మరణం చెందగా, ఆయన భౌతికకాయాన్ని ఎమ్మెల్యే సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. అనంతరం మొద్దులగూడెం గ్రామంలో ఆరోగ్య సమస్యతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దొడ్డా భాస్కరరావును పరామర్శించి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న తోట రాంబాబును పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గురైటి రాములు కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్లతో పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత

- అన్నపురెడ్డిపల్లి మండలానికి 544 నూతన చేయూత పెన్షన్లు మంజూరు
- లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



అన్నపురెడ్డిపల్లి,నవంబర్ 16,(ప్రజాజ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన నూతన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. అన్నపురెడ్డిపల్లి మండలానికి మొత్తం 544 నూతన చేయూత పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వృద్ధులు,వితంతువులు,ఒంటరి మహిళలకు ప్రతినెలా అందించే పెన్షన్లు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు. రోజువారీ అవసరాలను తీర్చుకోవడానికి ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని వివరించారు.అనంతరం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పెన్షన్ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా వారి కుటుంబాలకు కలుగుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్లు అందడంతో తమకు ఎంతో ఊరట కలుగుతోందని, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం తమ జీవనానికి ఎంతగానో తోడ్పడుతోందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పొదిలి జ్యోతి, మండల అధ్యక్షుడు పర్స వెంకట్, వనమా గాంధీ, భానోత్ భీముడు, వేముల రమణారావు, ఎంపీడీవో డి. రాజేశ్వరి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక సోమవారం.. శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు!





- తొలి సోమవారం సందర్భంగా ఆలయాలకు పోటెత్తిన భక్తజనం..
- ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు.. దీపారాధనలతో ఆధ్యాత్మిక శోభ
- కార్తీక మాసంలో శివారాధనకు విశేష ప్రాధాన్యత..
- దీపం వెలిగిస్తే పుణ్యఫలమని భక్తుల విశ్వాసం

దమ్మపేట,నవంబర్. 16,(ప్రజాజ్యోతి):: కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా దమ్మపేట మండలంలోని శివాలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు చేరుకుని పరమశివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దమ్మపేటలోని విష్ణు ఆలయం, శివాలయంతో పాటు వడ్లగూడెంలోని శ్రీ భువనసుందరి సమేత స్వయంభు దుర్గా మల్లేశ్వర స్వామి దేవాలయం, దమ్మపేట మండలం లోని దేవాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో ఆయా ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక రుద్రాభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో ఆలయాలకు చేరుకుని దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శివనామస్మరణ, భక్తుల పూజలు, దీపాల వెలుగులతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

కార్తీక మాసానికి ఎందుకంత ప్రత్యేకత?

హిందూ సంప్రదాయంలో కార్తీక మాసానికి అత్యంత పవిత్రమైన స్థానం ఉంది. చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం వచ్చే ఈ మాసం శివకేశవుల ఆరాధనకు విశేషమైనదిగా భావిస్తారు. ఈ మాసంలో తెల్లవారుజామున నదీస్నానాలు, ఉపవాసాలు, జపాలు, ధ్యానం, దానధర్మాలు, దీపారాధనలు చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. కార్తీక మాసంలో చేసే పూజలు, వ్రతాలు, దీపారాధనల వల్ల పుణ్యఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ముఖ్యంగా శివాలయాలను దర్శించడం, శివలింగానికి అభిషేకాలు చేయడం, మారేడు దళాలతో పూజించడం విశేష ఫలప్రదమని పురాణాలు పేర్కొంటాయి.

కార్తీక సోమవారాల విశిష్టత ఏమిటి?

సోమవారం పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజుగా భక్తులు భావిస్తారు. అందుకే కార్తీక మాసంలో వచ్చే ప్రతి సోమవారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఈ రోజున భక్తులు ఉపవాసం ఉండి, శివనామస్మరణ చేస్తూ, శివలింగానికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీరు, పవిత్ర జలాలతో అభిషేకాలు నిర్వహిస్తారు.

మారేడు దళాలు సమర్పించి ఓం నమఃశివాయ అనే పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తారు. కొందరు రోజంతా ఉపవాసం ఉండగా, మరికొందరు నియమ నిష్ఠలతో పూజలు నిర్వహిస్తారు. కార్తీక సోమవార వ్రతాన్ని ఆచరించడం వల్ల మనశ్శాంతి, కుటుంబ సౌఖ్యం, ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.

దీపారాధన వెనుక ఆధ్యాత్మిక అంతరార్థం

కార్తీక మాసంలో దీపం వెలిగించడానికి ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. దీపం జ్ఞానానికి,పవిత్రతకు,అజ్ఞానాంధకారాన్ని తొలగించే వెలుగుకు ప్రతీకగా భావిస్తారు.కార్తీక మాసంలో ప్రతిరోజూ సాయంత్రం ఇంటి ముందు, తులసికోట వద్ద,ఆలయప్రాంగణాల్లో దీపాలు వెలిగించడం సంప్రదాయం. ముఖ్యంగా కార్తీక సోమవారాల్లో శివాలయాల్లో దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు.

దీపారాధన వల్ల పాపాలు తొలగి పుణ్యం లభిస్తుందని పురాణ విశ్వాసం. దీపం వెలిగించడం కేవలం ఆచారం మాత్రమే కాకుండా మనలోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించాలనే ఆధ్యాత్మిక సందేశాన్ని కూడా అందిస్తుంది.

శివకేశవుల ఆరాధనకు ప్రతీక కార్తీక మాసం

కార్తీక మాసంలో శివారాధనతో పాటు విష్ణుమూర్తి ఆరాధనకూ విశేష ప్రాధాన్యత ఉంది. ఈ మాసంలో తులసి పూజ, తులసి దామోదర వ్రతం, ఏకాదశి వ్రతం, క్షీరాబ్ధి ద్వాదశి వంటి పర్వదినాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.కార్తీక పౌర్ణమి ఈ మాసంలో మరో ముఖ్యమైన పర్వదినం. ఆరోజు దీపాలు వెలిగించడం, ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శివకేశవులిద్దరినీ ఆరాధించే పవిత్ర మాసంగా కార్తీక మాసం ప్రసిద్ధి చెందింది.

భక్తి, నియమ నిష్ఠలకు ప్రతీక

కార్తీక మాసం మనిషికి ఆధ్యాత్మిక చింతనతో పాటు క్రమశిక్షణ, దయ, దానగుణం, సేవాభావం వంటి విలువలను గుర్తుచేస్తుంది. ఈ మాసంలో భక్తులు తమకు సాధ్యమైనంత వరకు అన్నదానం, వస్త్రదానం, పేదలకు సహాయం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

తెల్లవారుజామున నిద్రలేచి స్నానాలు ఆచరించడం,ఆలయాలను సందర్శించడం, దీపారాధన చేయడం ద్వారా ఆధ్యాత్మిక జీవన విధానాన్ని అలవర్చుకుంటారు.

ఇలా కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా దమ్మపేట మండలంలోని ఆలయాల్లో కనిపించిన భక్తుల సందడి, దీపాల వెలుగులు, ప్రత్యేక పూజలు ఈ పవిత్ర మాసం యొక్క విశిష్టతను చాటిచెప్పాయి. భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయాల సమ్మేళనంగా కార్తీక మాసం భక్తుల జీవితాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.







మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- మొద్దులగూడెంలో డ్వాక్రా మహిళల కమ్యూనిటీ భవనానికి ఎమ్మెల్యే జారె శంకుస్థాపన



దమ్మపేట, నవంబర్. 16, (ప్రజాజ్యోతి): మహిళా సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్వావలంబన సాధించడంతో పాటు కుటుంబ, గ్రామీణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. దమ్మపేట మండలం మొద్దులగూడెం గ్రామంలో డ్వాక్రా మహిళల కోసం నిర్మించనున్న కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడానికి, సంఘ కార్యకలాపాలను సమర్థవంతంగా కొనసాగించడానికి కమ్యూనిటీ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మహిళలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, వారు ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించేలా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. మహిళా సంఘాలు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కక్కిరాల రమేష్, స్థానిక సర్పంచ్ బేతం రుక్మిణి, ఉప సర్పంచ్ కూరం సరస్వతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక సోమవారం శివాలయాలకు పోటెత్తిన భక్తులు

♦ శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, భస్మాభిషేకాలు





భద్రాచలం, నవంబర్ 16 (ప్రజా జ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా భద్రాచలం పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే మహిళలు, భక్తులు గోదావరి నదికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థాన అనుబంధ ఆలయాలైన శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, భస్మాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా అంబా సత్రంలోని శివాలయం, సాధువుల మండపంలోని శివాలయం, వెంకటేశ్వర కాలనీలోని శివాలయాల్లో భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి దీపారాధనలు చేశారు. కార్తీక మాసంలో సోమవారం పరమశివుడికి అత్యంత ప్రీతికరమైన రోజుగా భావించడంతో భక్తులు ఉపవాసాలు పాటిస్తూ శివనామస్మరణలో నిమగ్నమయ్యారు. అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి వారి రామాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని, లోకకల్యాణం జరగాలని పరమశివుడిని ప్రార్థించారు. దీంతో భద్రాచలంలోని శివాలయాలన్నీ భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

నిరుద్యోగులకు అండగా ఉంటాం

► పోటీ పరీక్షల అభ్యర్థులకు కరెంట్ అఫైర్స్ పుస్తకాల పంపిణీ

► నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్ట భద్రుల బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి




భద్రాచలం, నవంబర్ 16 (ప్రజా జ్యోతి): భద్రాచలం పట్టణంలోని ప్రాంతీయ గ్రంథాలయాన్ని సోమవారం బీఆర్ఎస్ రాష్ట్రనాయకులు, నల్గొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి సందర్శించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే కరెంట్ అఫైర్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత సహనాన్ని పరీక్షించవద్దన్నారు. ఉద్యోగాల భర్తీలో జాప్యం కొనసాగితే విద్యార్థులు, నిరుద్యోగులను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ రావులపల్లి రాంప్రసాద్, పోనీ రామకృష్ణ, ఆకో సునీల్ కుమార్, రేపాక పూర్ణచంద్రరావు, మహిళా నాయకురాళ్లు, యువనాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, పోటీ పరీక్షల అభ్యర్థులు పాల్గొన్నారు.

ఐజెయు టియుడబ్ల్యూజే (హెచ్-143)రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా తోట రామకృష్ణ ఎన్నిక



పాల్వంచ, నవంబర్ 16, ప్రజా జ్యోతి: ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) అనుబంధ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజే – హెచ్-143) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ తోట రామకృష్ణ ఎన్నికయ్యారు.యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, రాష్ట్ర ప్రధా న కార్యదర్శి అస్కాని మారుతి సాగర్ నియమించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (ఎస్సీఆర్ఓ) గోర్ల బుచ్చన్న ఈ నెల 15న అధికారిక ఎన్నికల ప్రకటన విడుదల చేశారు. ఎన్నికైన రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల జాబితాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి తోట రామకృష్ణ పేరు నమోదైంది. పాల్వంచ మండలానికి చెందిన తోట రామకృష్ణ ప్రస్తుతం టీ న్యూస్ సీనియర్ జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. జిల్లాలో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆయన కృషి చేస్తున్నారు.ఈ సందర్భంగా తోట రామకృష్ణ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఎన్నికకు కృషి చేసిన టియుడబ్ల్యూజే (హెచ్–143) వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం నారాయణ, రాష్ట్రప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, టిటిడబ్ల్యూజేఏ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, టియుడబ్ల్యూజే (హెచ్–143) భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ షఫీ, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రవి తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.యూనియన్ బలోపేతానికి, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు.తోట రామకృష్ణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక కావడం పట్ల జిల్లా జర్నలిస్టులు, సహచరులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయురాలి కుటుంబానికి రూ.6 లక్షల ఆర్థిక సాయం



ములకలపల్లి, నవంబర్ 16 (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టి ఎస్ యుటీఎఫ్) కుటుంబ సంక్షేమ పథకం కింద ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయురాలి కుటుంబానికి రూ.6 లక్షల ఆర్థిక సాయం అందజేశారు.మంగపేట జీపీఎస్ లో ఎస్ జీటీగా పనిచేస్తున్న ఎం. కోటమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, ఆదివారం ఆమె భర్త రామభద్రయ్యకు వారి స్వగృహం వద్దజిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమ పథకాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు వివిధ కారణాలతో మృతి చెందిన 70 మంది ఉపాధ్యాయుల కుటుంబాలకు రూ. 4.20 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. 'అందరి కోసం ఒక్కరు.. ఒక్కరి కోసం అందరూ' అనే నినాదంతో కొనసాగుతున్న ఈ పథకం టిఎస్ యుటిఎఫ్ సభ్యత్వం కలిగిన ఉపాధ్యాయులకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఫ్ డబ్ల్యూఎఫ్ కన్వీనర్ డి. దాసు, జిల్లా కార్యదర్శి ఎస్ కే యాకూబ్ పాషా, ములకలపల్లి మండల అధ్యక్షుడు బి. లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎం. కిషోర్, ఎఫ్ డబ్ల్యూఎఫ్ కన్వీనర్ డి. కోట్యా, కోశాధికారి కె. శ్రీరామ్, సహాధ్యక్షులు కె. సంతోష్ కుమార్, పి. జానకీదేవి, కార్యదర్శులు కె. మల్లయ్య, కె. వెంకటేశ్వర్లు, కె. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు ప్రారంభం

■ నవంబర్ 26న కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలి

■ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీసం శెట్టి పూర్ణచంద్రరావు పిలుపు



పాల్వంచ, నవంబర్ 16, ప్రజాజ్యోతి: పాల్వంచ మండలం నాగారం గ్రామ పంచాయతీలో వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని భద్రాద్రికొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు వీసంశెట్టిపూర్ణచంద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే అమలు చేయాలని, వి.బి.జి. రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికి సంవత్సరానికి రూ.12 వేల కూలి భరోసా అందించాలని కోరారు. అలాగే సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి రోజుకు రూ.700 కూలి చెల్లించాలని, ప్రతి వారం ఎలాంటి పెండింగ్ లేకుండా వేతనాలు అందించాలని అన్నారు.వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే కలెక్టరేట్ ధర్నాలో వ్యవసాయకార్మికులు,ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు నిమ్మల రాంబాబు, నాగారం ఉపసర్పంచ్ బానోత్ రంజిత్, సాయిలు శ్రీను, చంచలపురి శ్రీనివాసరావు, పోతమర్తి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలకు బ్రేక్ వేయండి...!

■ కంపగూడెంలో రెండు గంటల రాస్తారోకో..

■ బీటీ రోడ్డు మరమ్మతులు చేయాలని డిమాండ్





ములకలపల్లి నవంబర్ 16 (ప్రజాజ్యోతి): కంపగూడెం గ్రామం మీదుగా భారీ వాహనాల రాకపోకలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం రహదారిపై రెండు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే హామీతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా ఆందోళనలో పాల్గొన్న సీపీఎం మండల నాయకుడు నిమ్మల మధు మాట్లాడుతూ.. భారీ వాహనాల రాకపోకలతో కంపగూడెం బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతింటోందని అన్నారు. రహదారిపై గుంతలు ఏర్పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భారీ వాహనాల కారణంగా ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. వాహనాల రాకపోకలతో ఇళ్లలోకి దుమ్ము, ధూళి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాజుపేట బ్రిడ్జి వద్ద రూ.60 లక్షలతో డైవర్షన్ నిర్మించి, ఇరుకైన రహదారిపై భారీ వాహనాలను నడపడం వల్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిందన్నారు. కంపగూడెం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గుర్రం రాము, సున్నం గోపయ్య, కరుణాకర్, వార్డు సభ్యులు సడియం చిట్టెమ్మ, సున్నం సునీత, గడ్డం వెంకటేశ్వర్లు, సున్నం రమాదేవి, వినయ, ఊకె మహేశ్వరి, వెలకం ఈశ్వరి, గుర్రం సత్యవేణి, ఊకె ఆదిలక్ష్మి , యాకూబ్ పాషా, గుర్రం బాలాజీ, సంపత్, సున్నం శ్రీను, పూనెం రామకృష్ణ, ఊకె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ ప్రమాద మృతుడి కుటుంబానికి నష్టపరిహారం, ఒకరికి ఉద్యోగం కల్పించాలి

- కార్మికుల భద్రతపై యాజమాన్యం పటిష్ట చర్యలు తీసుకోవాలి
- వెంకటేశ్వర్లు కుటుంబానికి అండగా ఉంటాం: సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా



పాల్వంచ, నవంబర్ 16, ప్రజాజ్యోతి: కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) 7వ దశ సూపర్ క్రిటికల్ యూనిట్ కోల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఆర్టిజన్ గ్రేడ్–2 కార్మికుడు పెంబుల వెంకటేశ్వర్లు (42) కుటుంబానికి తక్షణమే నష్టపరిహారం చెల్లించడంతో పాటు, కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. కార్మికుల భద్రత పట్ల యాజమాన్యం, సంబంధిత అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కేటీపీఎస్‌లో విధి నిర్వహణలో భాగంగా వ్యాగన్ నుంచి బొగ్గును దించే క్రమంలో వ్యాగన్, వ్యాగన్ టిప్లర్ మధ్య చిక్కుకుని వెంకటేశ్వర్లు దుర్మరణం చెందారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సాబీర్ పాషా, పార్టీ నాయకులతో కలిసి సోమవారం పాల్వంచలోని వెంకటేశ్వర హిల్స్ కాలనీలో ఉన్న మృతుడి నివాసానికి చేరుకున్నారు. వెంకటేశ్వర్లు పార్థివదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ విధి నిర్వహణలో కార్మికుడు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుడి కుటుంబానికి కేటీపీఎస్ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అండగా నిలవాలని కోరారు. నష్టపరిహారం చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పవర్ ప్లాంట్‌లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంకటేశ్వర్లు కుటుంబానికి సీపీఐ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యుడు నిమ్మల రాంబాబు, నాయకులు ఆలపాటి ప్రసాద్, ఆర్టిజన్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాలల సమస్యలు పరిష్కరించిన సర్పంచ్ ఆదిలక్ష్మి



ములకలపల్లి నవంబర్ 16 (ప్రజాజ్యోతి): బాలసభలో విద్యార్థులు ప్రస్తావించిన సమస్యలపై మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి తక్షణమే స్పందించి పరిష్కరించారు. సోమవారం ఎంపీపీఎస్ మూకమామిడి పాఠశాలను సందర్శించి సమస్యలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలోని ముసగ చెట్టుకు పురుగులు పట్టి విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతుండటంతో వాటి నివారణకు చర్యలు చేపట్టారు. పాఠశాల పరిసరాల్లోని పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచి విద్యార్థులకు పరిశుభ్రమైన నీరు అందేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత, పరిశుభ్రతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బాలసభ అంటే పిల్లల సమస్యలను వినడమే కాకుండా వాటిని పరిష్కరించడం కూడా ముఖ్యమన్నారు. విద్యార్థులు తమ సమస్యలను ధైర్యంగా తన దృష్టికి తీసుకురావాలని, పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. బాలల సమస్యలపై సర్పంచ్ తక్షణమే స్పందించి పరిష్కరించడంపై గ్రామస్తులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దోమల అరుణ్ కుమార్, ఉపాధ్యాయుడు బి. శ్రీను, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పాల్వంచ పట్టణ కాంగ్రెస్ పరిశీల కుడిగా పైడా రాజేంద్ర ప్రసాద్ నియామకం

- మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన పట్టణ కాంగ్రెస్ నాయకులు



పాల్వంచ, నవంబర్ 16, ప్రజాజ్యోతి: పాల్వంచ పట్టణ కాంగ్రెస్ కమిటీ వ్యవహారాల పరిశీలకుడిగా నియమితులైన జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పైడా రాజేంద్ర ప్రసాద్‌ను పట్టణ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న ఆదేశాల మేరకు, టీపీసీసీ నిర్దేశించిన పాల్వంచ పట్టణానికి సంబంధించిన సమాచారాన్ని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల రంగారావు, పట్టణ కాంగ్రెస్ వ్యవహారాల పరిశీలకుడు పైడా రాజేంద్ర ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ లేబర్ సెల్ అధ్యక్షుడు సాదం రామకృష్ణ, పట్టణ కాంగ్రెస్ నాయకులు దొప్పలపూడి సురేష్ బాబు, బానోత్ రాము నాయక్, గుండు రవి, ఓలపల్లి రాంబాబు, బిల్లా సుజిత్, బాలు, మాలు నాయక్, మైనారిటీ కాంగ్రెస్ నాయకులు షేక్ దస్తగిరి, రఫీ, ఓబీసీ నాయకులు కాపర్తి చారి, యూత్ కాంగ్రెస్ నాయకులు గండు భరత్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల సామూహిక సెలవు



చర్ల, నవంబర్ 16: (ప్రజా జ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న సామూహిక సెలవు తీసుకొని నిరసన కార్యక్రమంలో పాల్గొనున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల చర్లలో పనిచేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాధారణ సెలవు మంజూరు చేయాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్రకు సోమవారం వినతిపత్రం అందజేశారు.తెలంగాణ రాష్ట్రంలోని సీపీఎస్ పరిధిలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్తు, సామాజిక భద్రతను దృష్టిలో ఉంచుకొని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు కోరారు. ఈ అంశంపై గత కొంతకాలంగా ప్రభుత్వానికి శాంతియుతంగా విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు . కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఓపీఎస్ పునరుద్ధరణ హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈ నెల 17న నిర్వహించనున్న శాంతియుత సత్యాగ్రహ దీక్ష, ధర్మదీక్ష నిరసన కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొననున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జయశ్రీ, శెట్టి ప్రసాద్, కొండలరావు, కృష్ణమోహన్, అమృతరావు, జాన్ వెస్లీ, నందికొండ వెంకన్న, దీప, హరీష్ బాబు, వెంకటేశ్వర్లు, కృష్ణ, సుధాకర్, గంగరాజు, శ్యామల, వీరాజు, లైబ్రేరియన్ వి. నవీన్, ల్యాబ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభం

- విద్యార్థుల హాజరు, పరీక్షల ఫలితాల మెరుగుదలకు మూడు నెలల పాటు భోజన వసతి



పాల్వంచ, నవంబర్ 16, ప్రజాజ్యోతి: పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంక్షేమం, కళాశాల హాజరు శాతం పెంపు, రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన లక్ష్యంగా మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. శంకర్ ఆధ్వర్యంలో కళాశాల సిబ్బంది, దాతల సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సీహెచ్. వెంకటేశ్వరరావు, లక్ష్మీదేవిపల్లి గ్రామసర్పంచ్ భూక్యమంజుల ప్రారంభించారు.విద్యార్థులకు సుమారు మూడు నెలల పాటు ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సీహెచ్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమం తప్పకుండా కళాశాలకు హాజరుకావాలని సూచించారు. చదువుపై పూర్తి దృష్టి కేంద్రీకరించి రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. శంకర్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం ముందుకు వచ్చిన కళాశాల సిబ్బంది, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, దాతలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

14,038 రేషన్ కార్డులు, 950 పెన్షన్ల పంపిణీ

- అర్హులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పత్రాల అందజేత
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం- ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



చర్ల, నవంబర్ 16: (ప్రజా జ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. చర్ల మండల కేంద్రంలోని నందీశ్వరుని కళాభవన్ లో మండల అధికారుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సంక్షేమ పథకాల పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు 14,038 రేషన్ కార్డులు, 950 పెన్షన్ మంజూరు పత్రాలు, 21 కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.